సాక్షి పల్నాడు

మంగళవారం । 23 । సెప్టెంబర్ । 2025



పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

దుగ్గిరాల: ప్రకాశం బ్యారేజీ నుంచి 5,009 క్యూసెక్కులు పశ్చిమ డెల్టాకు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12 అడుగుల నీటిమట్టం ఉంది.



పులిచింతలకు నీటి విడుదల

సత్రశాల(రెంటచింతల):టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్ నుంచి 2,84,677 క్యూసెక్కులు పులిచింతలకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఎస్‌ఈ తెలిపారు.



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీబాలా త్రిపుర సుందరీదేవి అలంకారంలో దుర్గమ్మను మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు దర్శించుకున్నారు.

కూటమి ద్రోహం.. పేదలకు శాపం

- 2024 జూన్ నాటికి 90 శాతం పూర్తయిన పిడుగురాళ్ల 100 పడకల ఆసుపత్రి నిర్మాణం
- ఏడాదిన్నరగా 10 శాతం పనులు చేయలేకపోయిన కూటమి ప్రభుత్వం
- వైద్య పరికరాలు సరఫరా చేసి ఉంటే అందుబాటులోకి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్
- సరైన వైద్యం అందక దూర ప్రాంతాలకు వెళ్తున్న పల్నాడు ప్రజలు
- 60 శాతానికి పైగా పూర్తయిన మెడికల్ కళాశాల భవన నిర్మాణాలు

కూటమి ప్రభుత్వం వెనుకబడిన పల్నాడు ప్రాంతానికి, ప్రజలకు మేలు చేయకపోగా ద్రోహం తలపెట్టింది. సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందక పేదలు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇది గమనించిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెడికల్ కళాశాలను, ఆస్పత్రి మంజూరు చేశారు. రూ.217 కోట్లు ఖర్చు చేసి భవనాలు నిర్మించారు. మిగిలిన పనులు పూర్తిచేస్తే పల్నాడు ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి వస్తుంది. కానీ కూటమి ప్రభుత్వం పనులు పూర్తిచేయక పోగా ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు సిద్ధమైంది. దీంతో పల్నాడు ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందని ద్రాక్షగా మారనుంది.

సాక్షి, నరసరావుపేట: పల్నాడు ప్రాంతానికి సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుబాటులో లేకపోవడంతో సరైన సమయంలో మెరుగైన వైద్యం అందక ఎంతో మంది అర్ధాంతరంగా తనువుచాలిస్తున్నారు. జిల్లాలో కీలకమైన కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్ హైవేలో దాచేపల్లి, పిడుగురాళ్ల వద్ద ప్రమాదం జరిగినా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాచర్ల చుట్టుపక్కల కొత్తగా వచ్చిన హైవేలలో జరగరాని ప్రమాదం జరిగితే సూపర్ స్పెషాలిటీ వైద్యం కోసం గుంటూరు, విజయవాడ లాంటి నగరాలకు వెళ్లాల్సి వస్తోంది. అక్కడికి వెళ్లేలోగా ఎన్నో ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. మరోవైపు మాచర్ల, గురజాల, పెదకూరపాడు నియోజకవర్గాలలోని గ్రామీణులకు మెరుగైన ప్రభుత్వ వైద్యం అందుబాటులో లేదు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని పల్నాడు ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యంతోపాటు ఈ ప్రాంతానికి మణిహారంగా ఓ ప్రభుత్వ మెడికల్ కళాశాల ఉండాలన్న ఉద్దేశంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పిడుగురాళ్ల శివారులోని బ్రహ్మణపల్లిలో మెడికల్ కళాశాలను మంజూరు చేసి నిర్మాణాలు ప్రారంభించింది. గత ప్రభుత్వ హయాంలో కోవిడ్ లాంటి సమస్యలు ఎదురైనా పనులు ఆగకుండా యుద్ధ ప్రాతిపాదికన సాగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కక్షతో పిడుగురాళ్ల మెడికల్ కళాశాల పనులు పక్కనపెట్టారు. పనులు చేయకుండా మెడికల్ కళాశాలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పనంగా ధారాదత్తం చేసే కుట్రలకు తెరదీశారు. ఇందులో భాగంగా సుమారు 90 శాతం పూర్తయిన 100 పడకల ఆసుపత్రి పనులను పూర్తి చేసే అవకాశమున్నా కావాలనే పనులు చేయకుండా ఈ ప్రాంత ప్రజలకు అన్యాయం చేశారు.



పిడుగురాళ్ల మెడికల్ కళాశాలలో దాదాపుగా పూర్తయిన ఆసుపత్రి భవనాలు

పరికరాలు సమకూరిస్తే సూపర్ స్పెషాలిటీ వైద్యం

పిడుగురాళ్ల సమీపంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మొదలుపెట్టిన మెడికల్ కళాశాల సుమారు 50 ఎకరాల్లో నిర్మిస్తున్నారు. ఇందులో భూమి కొనుగోలుకు అయిన ఖర్చు రూ.14.5 కోట్లు, భవన నిర్మాణాలకు సుమారు రూ.320 కోట్లు కాగా మొత్తం రూ.334.5 కోట్లు ఖర్చు పెడితే భవనాల నిర్మాణాలు పూర్తవుతాయి. ఇందులో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏకంగా రూ.217.07 కోట్లు ఖర్చు చేశారు. అంటే ఇది పూర్తి వ్యయంలో 66 శాతం పూర్తిచేసినట్టు. ఇక మిగిలింది 34 శాతం పనులు మాత్రమే. భవన నిర్మాణాలలో మెడికల్ కళాశాల, 100 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి రెండు గా విభజించారు. ఇందులో 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులు గత ప్రభుత్వ హయాంలో సుమారు 90 శాతం, మెడికల్ కళాశాల పనులు 60 శాతం పూర్తి అయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏడాదిన్నార పాలనలో 10 శాతం పనులు పూర్తి చేసి ఉంటే అద్భుతమైన 100 పడకల ఆసుపత్రి అందుబాటులోకి వచ్చేది. ఆసుపత్రికి అవసరమైన పరికరాలు కొనుగోలు చేసి ఉంటే ఈపాటికే పల్నాడు జిల్లా వాసులకు ఎంతో కీలకమైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చి ఎన్నో ప్రాణాలు నిలిచేవి. మెడికల్ కళాశాల నిబంధనల ప్రకారం వైద్య విద్య ప్రారంభానికి కనీసం ఆరు నెలల ముందు ఆసుపత్రిలో ఓపీ సేవలు ప్రారంభం కావాలి. పిడుగురాళ్ల 100 పడకల ఆసుపత్రిలో ఓపీ సేవలు ప్రారంభమై ఉంటే వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఎంబీబీఎస్ మొదటి ఏడాది అడ్మిషన్లు పూర్తయ్యి తరగతులు ప్రారంభించే అవకాశముటుంది. అయితే పేదలకు వైద్య విద్య అందుబాటులోకి రావడం ఏమాత్రం ఇష్టం లేని కూటమి ప్రభుత్వం పిడుగురాళ్ల మెడికల్ కళాశాలతోపాటు రాష్ట్రంలోని మరో 16 కాలేజీలను ప్రైవేట్‌పరం చేసేలా అడుగులు వేస్తోంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పిడుగురాళ్ల మెడికల్ కళాశాలకు ఖర్చు చేసిన నిధులు...

ఆర్థిక సంవత్సరం	ఖర్చు చేసిన నిధులు రూ.కోట్లలో
2020-21	14.50
2021-22	37.30
2022-23	86.77
2023-24	55.30
2024 జూన్ వరకు	23.20
మొత్తం	217.07



60 శాతం పూర్తయిన మెడికల్ కళాశాల భవన నిర్మాణాలు

పల్నాడు ప్రాంతానికి తీవ్ర అన్యాయం



పిడుగురాళ్ల మెడికల్ కళాశాల పల్నాడు ప్రాంతానికే మణిహారం లాంటిది. గత ప్రభుత్వంలో మేము చిత్తశుద్ధితో పనిచేసి ఆసుపత్రి పనులు 90 శాతం, కళాశాల పనులు సుమారు 60శాతం పూర్తిచేశాం. కూటమి ప్రభుత్వం మిగిలిన 10 శాతం ఆసుపత్రి పనులు పూర్తిచేసి అవసరమైన పరికరాలు ఏర్పాటు చేసి ఉంటే ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వచ్చేది. మెడికల్ కళాశాల ప్రైవేట్ పరం చేయడమంటే ఈ ప్రాంతానికి చేస్తున్న ద్రోహానికి నిదర్శనం. మెడికల్ కళాశాలను ప్రైవేట్ పరం చేయకుండా పోరాటం చేస్తాం, నిరంతరం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం.

–కాసు మహేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

న్యూస్‌రీల్

స్థోమత లేని ఖైదీలకు ఉచిత న్యాయ సాయం

గుంటూరు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి మహమ్మద్ జియావుద్దీన్



సత్తెనపల్లి: న్యాయవాదులను నియమించుకునే స్థోమతలేని రిమాండ్ ఖైదీలకు ఉచితంగా ప్రభుత్వ న్యాయవాదిని నియమిస్తామని గుంటూరు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి మహమ్మద్ జియావుద్దీన్ అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని సబ్‌జైలును సోమవారం ఆయన సందర్శించారు. న్యాయమూర్తి మహమ్మద్ జియావుద్దీన్ మాట్లాడుతూ న్యాయ వ్యవస్థలో న్యాయవాదిని నియమించుకొనే స్థోమత లేని వారికి ఉచిత ప్రభుత్వ న్యాయ సహ న్యాయవాదిని నియమించే సదుపాయాలు ఉన్నాయన్నారు. న్యాయమూర్తితోపాటు ప్యానల్ న్యాయవాది బీఎల్.లక్ష్మీకోటేశ్వరరావు, పారా లీగల్ వలంటీర్ షేక్ సుభానీ, సబ్‌జైలు సూపరింటెండెంట్ వెంకటరత్నం తదితరులు ఉన్నారు.

జ్వాలాముఖి అమ్మవారికి మంగళసూత్రాల సమర్పణ



అమరావతి: స్థానిక అమరేశ్వరాలయంలోని జ్వాలాముఖీదేవి అమ్మవారికి అర్చక కుటుంబానికి చెందిన శంకరమంచి రామమోహనరావు కుమారుడు గణేష్‌కుమార్ బంగారు మంగళ సూత్రాలను సమర్పించారు. సుమారు 12 గ్రాముల బరువుతో సుమారు రూ.1.50లక్షల విలువైన రెండు బంగారు మంగళసూత్రాలను సోమ వారం ఆలయంలో సంప్రోక్షణ నిర్వహించి ఈఓ రేఖకు అప్పగించారు. అనంతరం అర్చకుల ద్వారా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన బంగారు మంగళసూత్రాలను అలంకరించారు. తొలుత దాతలు అమరేశ్వరునికి అభిషేకం, బాలచాముండేశ్వరి అమ్మవార్లకు కుంకుమపూజలు నిర్వహించారు.

శుభం కోల్డ్ స్టోరేజ్‌లో పసుపు సీజ్



దుగ్గిరాల: స్థానిక శుభం కోల్డ్ స్టోరేజ్‌లో ఆరుబయట ఉంచిన పసుపు బస్తాలను లోపల వేసి సీజ్ చేయాలని సిబ్బందిని తహసీల్దార్ ఐ. సునీత ఆదేశించారు. కోల్డ్ స్టోరేజ్‌లో గతంలో అగ్నిప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. అందులో మిగిలిన 1169 బస్తాలను అప్పట్లో సీజ్ చేశారు. పురుగులు పడుతున్నాయని, వాటిని బయటకు తీసి యాజమాన్యం గ్రేడింగ్ చేస్తుండగా స్థానిక రైతులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఆమెతోపాటు పసుపు యార్డు సెక్రటరీ జె.వి. సుబ్బారావు హుటాహుటిన కోల్డ్‌స్టోరేజ్‌కు చేరుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సీజ్ చేసిన పసుపు బస్తాలను బయటకు ఎందుకు తీశారని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. అనంతరం బస్తాలన్నింటిని లోపల వేసి, సీజ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఇద్దరు వీఆర్వోలు, యార్డ్ సిబ్బంది బస్తాలను లెక్కించినట్లు తహసీల్దార్ తెలిపారు.

ఆన్‌లైన్‌లో అగ్రిసెట్ ఫలితాలు

గుంటూరురూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఆగస్ట్ 18వ తేదీన ఆన్‌లైన్‌లో నిర్వహించిన అగ్రిసెట్- 2025 పరీక్ష ఫలితాలను సోమవారం వీసీ ఆర్. శారదజయలక్ష్మీదేవి విడుదల చేశారు. ఈ ప్రవేశ పరీక్ష ద్వారా వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయం, విత్తన సాంకేతికత పరిజ్ఞానం కోర్సుల్లో డిప్లొమా పూర్తి చేసిన అభ్యర్థులు నాలుగు సంవత్సరాల వ్యవసాయ డిగ్రీ కోర్సు చదువుకునేందుకు అర్హులవుతారని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షకు 844 మంది విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా రిజిస్టర్ చేసుకోగా 813 మంది హాజరయ్యారని తెలిపారు. వారిలో 753 మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. ఫలితాలు మంగళవారం నుంచి విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని, ర్యాంక్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని రిజిస్ట్రార్ ఎం.వి. రమణ తెలిపారు. అగ్రిసెట్ కౌన్సెలింగ్ తదితర వివరాల కోసం విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన సూచించారు.

జాతీయ రహదారుల పనులు సత్వరమే పూర్తిచేయండి

హైవేస్ నిర్మాణాలపై సమీక్ష చేసిన జిల్లా కలెక్టర్



నరసరావుపేట: జిల్లాలో నేషనల్ హైవేస్ చేపట్టిన జాతీయ రహదారి నిర్మాణాలకు కావాల్సిన పనులన్ని అధికారులు సత్వరమే పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా ఆదేశించారు. సోమవారం సాయంత్రం కార్యాలయంలో నిర్వహించిన నేషనల్ హైవేస్‌పై సమీక్షకు అధ్యక్షత వహించారు. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) జాతీయ రహదారి వినుకొండ నుంచి గుంటూరు వరకు 85.30 కిలోమీటర్ల పొడవున రెండు లేన్ల రహదారిని నాలుగు వరుసల రహదారి విస్తరణకు 544డి ప్రాజెక్ట్ చేపట్టారన్నారు. ఈ అలైన్‌మెంట్ పల్నాడు జిల్లాలో 53.91 కి.మీ, బాపట్ల జిల్లాలో 13.8 కి.మీ, గుంటూరు జిల్లా 18.19 కి.మీ ఉంటుందన్నారు. ప్రాజెక్ట్ కోసం మొత్తం 344.31 హెక్టార్ల భూమి అవసరం కాగా ప్రస్తుతం భూమి సేకరణ ప్రక్రియ, ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారీ కొనసాగుతోందన్నారు. ఈ ప్రాజెక్టు తాత్కాలిక అంచనా వ్యయం రూ.2605 కోట్లు ఖర్చు అవుతుందని డీఆర్‌ఓ పార్వతీశం పేర్కొన్నారు. పనులన్నీ త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ సూచించారు. జేసీ సూరజ్ ధనుంజయ్ గనోరే, డీఆర్‌ఓ ఏకా మురళి, నరసరావుపేట, సత్తెనపల్లి ఆర్డీవోలు కె.మధులత, రమాకాంతరెడ్డి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గ్రానైట్ లారీలు

కారెంపూడి: మార్టూరు నుంచి మహారాష్ట్రకు వెళ్తున్న రెండు గ్రానైట్ లోడు లారీలను కారెంపూడి ఎస్‌ఐ వాసు పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. పన్ను కట్టకుండా గ్రానైట్ తరలిపోతుందని పోలీసులు వాహనాలను ఆపారు. అనంతరం సేల్స్‌టాక్స్, మైనింగ్ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు పరిశీలన చేస్తున్నట్లు తెలుస్తోంది.

అర్జీదారుని సంతృప్తే ధ్యేయంగా పరిష్కరించాలి

పీజీఆర్‌ఎస్‌లో 163 అర్జీలు స్వీకరించిన కలెక్టర్, అధికారులు

నరసరావుపేట: అర్జీదారుల సంతృప్తే ధ్యేయంగా సమస్యలను సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు అధ్యక్షత వహించి జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, ఇతర జిల్లా అధికారులతో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి ద్వారా 163 అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటి జాప్యానికి తావు లేకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. డీఆర్‌ఓ ఏకా మురళి, ఆర్డీఓ కె.మధులత, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆలయ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడండి

స్థానిక ప్రపత్తి ఆంజనేయస్వామికి చెందిన స్థిరాస్తిని, నిర్వహణ బాధ్యతలు చూస్తున్న వ్యక్తి వాణిజ్య దుకాణాలకు అతని భార్య పేరిట హక్కు పత్రాలు సృష్టించుకున్నాడు. వాటిని బ్యాంకులో తాకట్టు పెట్టి రుణం తీసుకునే క్రమంలో ఈ విషయం బయటపడింది. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోండి.

–తవ్వా వెంకటనర్సు, బచ్చు రాజేష్, ఆలయ కమిటీ సభ్యులు, యడ్లపాడు

అవకతవకలపై చర్యలు తీసుకోండి

గ్రామంలో చేపట్టిన ఎంజీఎన్‌ఆర్‌ఇజీఎస్ పనుల్లో అసలు పనిచేయని, గ్రామంలో లేని వారి పేర్లపై మస్టర్లు రాసి వారి అకౌంట్లలో డబ్బులు జమ చేసి ఫీల్డు అసిస్టెంట్ కమీషన్ తీసుకుంటున్నాడు. పని చేసిన తమకు తక్కువ అమౌంట్ జమచేస్తూ అసలు పనిచేయనివారి ఖాతాలో ఎక్కువ నగదు జమ చేస్తున్నాడు. ఈవిధంగా నిధులు దుర్వినియోగం చేశారు. దీనిపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోండి.

–షేక్ హసన్, మస్తాన్‌వలి, ములకలూరు, నరసరావుపేట మండలం

మమ్మల్ని తిరిగి విధుల్లోకి తీసుకోండి

దాచేపల్లి పెదగార్లపాడులో ఉన్న శ్రీ సిమెంట్ ఫ్యాక్టరీ యజమానులు లోడింగ్ కార్మికులు గత రెండున్నరేళ్లుగా పనిచేస్తున్న సుమారు 70 మందిని విధుల నుంచి తొలగించారు. మేమంతా స్థానిక ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారిమి. మాకు బదులుగా ఉత్తరప్రదేశ్ నుంచి ఉద్యోగులను పిలిపించుకొని పనిచేయించుకుంటామని బెదిరిస్తున్నారు. సదరు కాంట్రాక్టర్‌తో మాట్లాడి తమను ఉద్యోగులుగా చేర్చుకునేందుకు చర్యలు తీసుకోండి.

–శ్రీ సిమెంట్ ప్యాకింగ్ ఎస్సీ, ఎస్టీ కార్మికులు, దాచేపల్లి

యానిమేటర్‌పై చర్యలు తీసుకోండి

షర్మిల మహిళా డ్వాక్రా గ్రూపులో సభ్యురాలిగా ఉన్న నాతోపాటు పదిమందికి తెలియకుండా గ్రూపు ఆర్గనైజర్‌గా ఉన్న యానిమేటర్ బ్యాంకు నుంచి రూ.20 లక్షల వరకు రుణం తీసుకుంది. పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు ఆమెపై ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదు. వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకొని మమ్మల్ని రుణ విముక్తులను చేయండి.

–ధూమాల జైరాణి, షర్మిలా మహిళా గ్రూపు, ఇర్లపాడు, నాదెండ్ల మండలం

నిజమైన రైతుకు యూరియా అందించండి

- బ్లాక్ మార్కెట్ అరికట్టండి
- ప్రభుత్వాధికారుల సమక్షంలో రైతులకు పంపిణీ చేయండి
- పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు



పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: జిల్లాలో రైతులకు యూరియాను అందించటంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టి నిజమైన రైతుకు అధికారుల ద్వారా అందజేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు హాజరై కలెక్టర్ కృతికా శుక్లాకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ యూరియా దొరక్క రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సరిపడినంత ఉందని, అందరికీ అందిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు చెబుతున్న దానిలో వాస్తవంలేదని అన్నారు. ఒక్కొక్క సొసైటీకి మూడు నాలుగు లారీలు యూరియా తీసుకెళ్లి టీడీపీకి చెందిన రైతులు, వారి బంధువులకు మాత్రమే ఇస్తున్నారే తప్ప, రైతులందరికీ ఇవ్వట్లేదన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా నిజమైన రైతులందరికీ పాస్ పుస్తకాల ఆధారంగా ఎకరానికి ఇంత అని నిర్ణయించి ఎన్ని ఎకరాలు ఉంటే అంత యూరియా అందజేయాలని డిమాండ్ చేశారు. బుచ్చిపాపన్నపాలెం సొసైటీ పరిధిలో టీడీపీకి చెందిన రైతులు, వారి బంధువులకు మాత్రమే ఇస్తున్నారని స్పష్టం చేశారు. కొత్తపల్లి, రెడ్డిపాలెం, సంతగుడిపాడు గ్రామాల్లో కూడా యూరియా సంబంధిత రైతులకు ఇవ్వకుండా బ్లాక్‌లో అమ్ముతున్నారన్నారు. ఒక గ్రామానికి చెందిన యూరియా లోడ్ దించితే ఆ గ్రామ రైతులకు ఇవ్వకుండా వేరే గ్రామాలకు చెందిన రైతులకు ఇస్తున్నారన్నారు. ఇలా కాకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇచ్చినా సంతోషమని, అక్కడ కాదంటే గ్రామంలో పంచాయతీ ఆఫీసులోనైనా దించి ఒక ప్రభుత్వ అధికారిని నియమించి, ఆ గ్రామానికి సంబంధించి విలేజ్ అసిస్టెంట్, వీఆర్‌ఓ, విలేజ్ సెక్రటరీ ద్వారా యూరియాను సరఫరా చేస్తే, నిజమైన రైతులు అందుతుందన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ సమీక్ష చేసి అధికారులను పిలిపించుకొని మాట్లాడి అందరికీ యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రానికి వెళ్లి పాస్‌బుక్ చూపిస్తే మారు మాట్లాడకుండా ఎరువులు అందించారని, రైతులు రోడ్డు ఎక్కకుండా పరిపాలన చేశారని గుర్తు చేశారు.

డిపెప్ స్కూలు కూల్చివేతలపై చర్యలు తీసుకోవాలి

రొంపిచర్ల మండలం బుచ్చిపాపన్నపాలెం గ్రామంలో డిపెప్ స్కూలులో అనధికారికంగా వంటగది, బాత్రూమ్, వంట గది, వాటర్ ట్యాంకు, చెట్టు కూల్చివేసిన ప్రైవేటు వ్యక్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్‌కు పేర్లతో సహా వివరిస్తూ అర్జీ అందజేశామని డాక్టర్ గోపిరెడ్డి పేర్కొన్నారు. జిల్లా రైతు విభాగ అధ్యక్షులు అన్నెం పున్నారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పడాల శివారెడి, పట్టణ అధ్యక్షులు షేక్ కరిముల్లా, నాయకులు మూరె రవీంద్రారెడ్డి, పచ్చవ రవీంద్రబాబు, పానుగోటి వెంకట్రావు, యాంపాటి వెంకటప్పరెడ్డి, పడాల హనుమిరెడ్డి, రంగారెడ్డి, చీమల శ్రీనివాసరెడ్డి, గజ్జల ముసలారెడ్డి, జయమ్మ, రైతు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రజత కవచాలంకృతగా దర్శనమిచ్చిన బాలచాముండేశ్వరీదేవి

అమరావతి: ప్రఖ్యాత శైవక్షేత్రమైన అమరావతిలో వేం చేసియున్న శ్రీ బాలచాముండిక సమేత అమరేశ్వరాలయంలో శ్రీ దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు సోమవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఆశ్వీయుజశుద్ధ పాడ్యమి నుంచి దశమి వరకు 9 రోజులపాటు ఘనంగా నిర్వహించే ఈ వేడుకలలో మొదటిరోజు రజతకవచాలంకృత అలంకారంలో బాలచాముండేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయ కార్యనిర్వహణాధికారి రేఖ ఆధ్వర్యంలో చండీ, రుద్ర హోమాలు, శ్రీచక్రార్చన నిర్వహించారు. ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ అమ్మవారి అలంకార విశిష్టతను వివరించారు. ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసురమర్దని అమ్మవార్లకు కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో తొలిరోజు వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని బాలత్రిపుర సుందరిదేవిగా అలంకరించారు.



రజతకవచాలంకృత అలంకారంలో బాలచాముండేశ్వరి అమ్మవారు

అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. ఉదయం వాసవీ మహిళా మండలి సభ్యులు లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. మెయిన్ బజార్‌లోని సీతాసమేత శ్రీ కోదండరామస్వామి దేవస్థానంలోని శ్రీదేవీశరన్నవరాత్రమహోత్సవాలలో భాగంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక బాలత్రిపురసుందరిదేవి అలంకారం చేశారు. గ్రామంలోని భక్తులు పెద్ద సంఖ్యలో మూడుదేవాలయాలను సందర్శించి పూజలు నిర్వహించారు..


శాస్త్రోక్తంగా నవరాత్రి కలశ స్థాపన

దేవీ శరన్నవరాత్రోత్సవాలలో భాగంగా తొలిరోజు ఆలయ అర్చకులు విఘ్నేశ్వర పూజతో ప్రారంభించి పుణ్యాహవచనం, నవగ్రహ మండపారాధన, రుత్విక్కరణతో కలశస్థాపన నిర్వహించారు. జ్వాలాముఖి, బాలాచాముండేశ్వరి అమ్మవార్ల అలయాలలో త్రికాలర్చనలు నిర్వహించారు. భక్తులచే నిర్వహించబడే చండీహోమాలను ఉభయదాతలతో నిర్వ హించారు.

తల్లిదండ్రుల నుంచి రక్షణ కల్పించండి

- జిల్లా అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) సంతోష్‌కు నవదంపతుల వినతి
- పెళ్లి దుస్తులతో పీజీఆర్‌ఎస్‌కు హాజరు

నరసరావుపేటరూరల్: తల్లిదండ్రుల నుంచి తమకు రక్షణ కల్పించాలని నవ దంపతులు సోమవారం జిల్లా అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) జేవీ సంతోష్‌ను కోరారు. చిలకలూరిపేటకు చెందిన వి.ఆది వెంకట చెన్నకేశవరాజు, షేక్ కమర్ ఇ అజమ్‌లు ఏడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరి మతాలు వేరు కావడంతో ఇద్దరి తల్లిదండ్రులు పెళ్లికి అంగీకరించలేదు. నాలుగు నెలల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయి గుడిలో పెళ్లి చేసుకున్నారు. నీకు నచ్చిన విధంగా అందరి సమక్షంలో చెన్నకేశవరాజుతో వివాహం చేస్తామని కమర్ ఇ అజమ్ తల్లిదండ్రులు ఆమెను తీసుకెళ్లారు. ఆ తరువాత చెన్నకేశవరాజుతో మాట్లాడవద్దని ఆంక్షలు విధించి ఇద్దరిని కలవకుండా చేశారు. దీంతో ఇంటి నుంచి బయటకు వచ్చిన చెన్నకేశవరాజు, కమర్ ఇ అజమ్‌లు సోమవారం ఉదయం చిలకలూరిపేటలోని



జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన నవ దంపతులు

బాలాజీ దేవాలయంలో మరోమారు వివాహం చేసుకున్నారు. పెళ్లికి పెద్దల అంగీకారం లేకపోవడంతో తమకు వారి నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని పెళ్లి బట్టలతో జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. పీజీఆర్‌ఎస్‌లో ఎస్పీని కలిసి రక్షణ కల్పించాలని కోరారు. నవదంపతుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఏర్పాటుచేసి వారి నుంచి ఎలాంటి సమస్యల లేకుండా చూడమని డీఎస్పీ హనుమంతరావును అడిషనల్ ఎస్పీ ఆదేశించారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 2,400 గరిష్టం : రూ. 3,400

మోడల్ ధర రూ. 2,900

పసుపు ధరలు (సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 1173

కొమ్ములు : 957 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,325	10,785	10,650

కాయలు : 216 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,325	10,650	10,525

మొత్తం అమ్మకాలు : 879.75 క్వింటాళ్లు

క్లుప్తంగా

మాతృ మరణాలను అరికట్టాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి



గుంటూరుమెడికల్: గుంటూరులోని కార్యాలయంలో సోమవారం డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అధ్యక్షతన సబ్ డిస్టిక్ లెవెల్ మాతృ మరణాల సమీక్ష సమావేశం జరిగింది. చేబ్రోలు, నిడమర్రు, మందపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జులై, ఆగస్టుల్లో జరిగిన మూడు మాతృ మరణాలపై సభ్యులు సమీక్షించారు. మరణానికి గల కారణాలను అధ్యయనం చేశారు. అందులో ఒకటి నివారించగలిగినది గాను, రెండు నివారించలేనివిగాను నిర్ధారించారు. సమావేశానికి హాజరైన ఆశా కార్యకర్తలు,ఆరోగ్య కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, వైద్యాధికారులతో డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడారు. గర్భం దాల్చినప్పటి నుంచి తరచుగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, పౌష్టికాహారం పై అవగాహన కల్పించాలని చెప్పారు. తొలుత ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎ. శ్రావణ్‌బాబు, డీసీహెచ్ఎస్ డాక్టర్ రంగారావు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ రోహిణి రత్నశ్రీ, జీజీహెచ్ గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ అరుణ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగలు అరెస్టు

లక్ష్మీపురం: చెడు వ్యసనాలకు అలవాటుపడి గంజాయి విక్రయిస్తూ, ద్విచక్ర వాహనాలు చోరీ చేసే ఎనిమిది మంది అంతర్రాష్ట్ర దొంగలను అరండల్‌పేట పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం బ్రాడీపేటలో కొంత మంది గుంపుగా చేరి గంజాయి విక్రయిస్తున్నట్లు అరండల్‌పేట సీఐ ఆరోగ్యరాజుకు సమాచారం వచ్చింది. హుటాహుటిన ఆయన ఎస్ఐ కృష్ణబాజీ, సిబ్బందితో ఆకస్మిక దాడులు నిర్వహించగా కొంత మంది పరారయ్యారు. మిగిలిన వారిలో శ్రీనగర్‌కు చెందిన ఇంజాపల్లి మేరిబాబు, వెంగళరావునగర్‌కు చెందిన యద్దనపూడి దీనభాస్కర్, శారదా కాలనీకి చెందిన బడుగు ప్రభుకుమార్, ఒక మైనర్ బాలుడు, గోరంట్లకు చెందిన పణిదరపు అమరజ్యోతి, వెంగళరావు నగర్‌కు చెందిన ఏలూరి ఎలిజిబెత్‌రాజు, శివనాగరాజు కాలనీకి చెందిన తూతిక అలియాస్ పాతూరి సైని, అలియాస్ హనీ, ఒడిశా రాష్ట్రంలోని పారిమ గ్రామానికి చెందిన పారిమ జోయామాజిలను అదుపులో తీసుకుని, కేసు నమోదు చేశారు. వీరి వద్ద గల 3.5 కేజీల గంజాయితో పాటు చోరీ చేసిన ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. వీరితోపాటు ఏసుబాబు, హర్ష సరిపుద్దీన్, దుర్గాప్రసాద్, లక్ష్మణ్, అమరజ్యోతి, ఈశ్వర్, మురళి, వీరాస్వామిలు పరారీలో ఉన్నారు.



నేత్రపర్వం.. నగరోత్సవంలో భాగంగా పల్లకీపై ఊరేగుతున్న ఆది దంపతులు

వైభవంగా ప్రారంభమైన 'శరన్నవ' సంబరం

జగన్మాత కనక దుర్గమ్మ భక్తకోటి హృదికి బాలగా, నిత్య కల్యాణశీలిగా సాక్షాత్కరించిన వేళ.. దేదీప్యమానమైన ఇంద్రకీలాద్రి భక్త కోటితో మరింత తేజోమయమైంది. నవరాత్రుల శోభ విజయవాడ నలుదిశలా పండువెన్నెలలా ప్రకాశించింది. ఇంద్రకీలాద్రిపై దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు శ్రీ బాలా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. భజన బృందాలు.. కోలాటాలు.. సాంస్కృతిక కార్యాక్రమాల సందడితో దుర్గగుడి పరిసరాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.



దుర్గగుడిపై నేడు

- తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి అమ్మవారి దర్శనం
- ఉదయం ఆరు గంటలకు ప్రత్యేక ఖడ్గమాలార్చన(ఆరో అంతస్తు)
- ఉదయం 7గంటలకు, 10గంటలకు ప్రత్యేక కుంకుమార్చన(ఆరో అంతస్తు)
- ఉదయం 9 గంటలకు ప్రత్యేక చండీయాగం (యాగశాల)
- ఉదయం 9 గంటలకు ప్రత్యేక శ్రీచక్రనవార్చన(లక్ష కుంకుమార్చన వేదిక)
- సాయంత్రం 4 గంటలకు శ్రీ గంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి వార్ల నగరోత్సవ సేవ
- సాయంత్రం 6 గంటలకు మహా నివేదన, పంచహారతుల సేవ, వేద స్వస్తి
- రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనం

పూర్ణఫలం.. బాలానందం

- తొలి రోజు బాలా త్రిపురసుందరీదేవిగా దుర్గమ్మ దర్శనం
- తొలి దర్శనం చేసుకున్న మంత్రులు, జిల్లా అధికారులు
- భక్తులతో పోటెత్తిన ఇంద్రకీలాద్రి
- వేడుకగా ఆది దంపతుల నగరోత్సవం
- నేడు శ్రీగాయత్రిదేవిగా దర్శనం





త్రిపుర సుందరీదేవిని దర్శించుకునేందుకు క్యూలైన్లో వేచి ఉన్న భవానీలు, భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున ప్రధాన ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌కు స్నపనాభిషేకం, అలంకరణ, నిత్య పూజల అనంతరం దర్శనాలకు అనుమతించారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోం మంత్రి అనిత, విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే సుజనాచౌదరి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, దుర్గగుడి ఈవో శీనా నాయక్‌లతో పాటు పలువురు జిల్లా అధికారులు తొలి దర్శనం చేసుకున్నారు. ఉదయం 8 గంటలకు అన్ని క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు. ప్రధాన ఆలయంలోని అమ్మవారి ఉత్సవ మూర్తిని మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా మహా మండపం ఆరో అంతస్తుకు తీసుకువెళ్లి ప్రతిష్టించారు. ఆరో అంతస్తులో అమ్మవారి ఉత్సవ మూర్తికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించగా, మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణం సమీపంలోని యాగశాలలో కలశస్థాపన, పూజా కార్యక్రమాలతో ఉత్సవాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి.

జన హృది బాలా.. నిత్యకల్యాణశీలా..

బాలా త్రిపుర సుందరీదేవి అలంకారంలో దుర్గమ్మకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. మహా మండపం ఆరో అంతస్తులో ప్రత్యేక కుంకుమార్చనలో 104 మంది ఉభయ దాతలు ఆలయ ప్రాంగణంలో శ్రీచక్రనవార్చనలో 13 మంది, చండీయాగంలో 29మంది ఉభయ దాతలు పాల్గొన్నారు. పూజల్లో పాల్గొన్న వారికి రూ.300 క్యూలైన్‌లో బంగారు వాకిలి దర్శనం కల్పించారు. ఇక పరోక్ష చండీ హోమానికి 57మంది, కుంకుమార్చనకు 18మంది రుసుం చెల్లించి ఆన్‌లైన్‌లో పూజను వీక్షించారు. మహా మండపం ఆరో అంతస్తులో సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నయనానందకరం.. నగరోత్సవం..

ఆది దంపతుల నగరోత్సవ సేవ సోమవారం సాయంత్రం కనుల పండువగా సాగింది. శ్రీగంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై ఊరేగింపు నిర్వహించారు. మేళ తాళాలు, మంగళవాయిద్యాలతో పాటు కేరళ వాయిద్యాలు, కోలాట నృత్యాలు, కావడి నృత్యాలతో పలువురు కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. మహా మండపం నుంచి ప్రారంభమైన నగరోత్సవం కనకదుర్గనగర్, రథం సెంటర్, దుర్గాఘాట్, దుర్గగుడి ఘాట్‌రోడ్డు మీదగా అమ్మవారి ఆలయానికి చేరుకుంది.

ఏర్పాట్ల పరిశీలన..

ఉత్సవాల ఏర్పాట్లను కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర బాబు, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర పరిశీలించారు. తొలుత కలెక్టర్, కమిషనర్ క్యూలైన్‌లో ఉన్న భక్తులతో ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో చర్చించారు. అనంతరం నూతన అన్నదాన భవనంలో జరుగుతున్న అన్న ప్రసాద వితరణను పరిశీలించారు. ఆలయ ఈవో శీనానాయక్‌తో కలిసి అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరించారు. ఆహార పదార్థాల నాణ్యత, ఆలయ సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై భక్తులను అడిగి తెలుసుకున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు..

దేవస్థానంలోని కళావేదికపై ప్రదర్శించిన అంశాలు ఆకట్టుకున్నాయి. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సాంస్కృతిక కార్యక్రమాలు 12 గంటలపాటు సాగాయి. పలు బృందాలకు చెందిన కళాకారులు నృత్యాలను అభినయించారు. కాగా ఉత్సవాల్లో రెండో రోజైన మంగళవారం దుర్గమ్మ శ్రీగాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిస్తారు.



కోలాటం ఆడుతున్న యువతులు



నాట్య సమ్మోహనం.. సాంస్కృతిక కార్యక్రమంలో నాట్య ప్రదర్శన చేస్తున్న కళాకారిణి

పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలి

- అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) సంతోష్
- జిల్లా ఎస్పీ కార్యాలయంలో పీజీఆర్ఎస్
- అర్జీలు స్వీకరించిన అడిషనల్ ఎస్పీ



అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) సంతోష్

నరసరావుపేట రూరల్: పీజీఆర్ఎస్ ఫిర్యాదులకు ప్రాధాన్యమిచ్చి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషిచేయాలని జిల్లా అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) జేవీ సంతోష్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ సంతోష్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. 114 అర్జీలు అందాయి

గృహ రుణం పేరుతో రూ.50 లక్షల మోసం

నరసరావుపేటలోని పల్నాడు రోడ్డులో ఎంజే అసోసియేట్స్ పేరుతో అమీర్, మస్తాన్, బాషాలు కార్యాలయం నిర్వహిస్తున్నారు. పట్టణానికి చెందిన ఇనకొల్లు వాసు, జొన్నలగడ్డకు చెందిన సిలివేరి వేమలయ్యతోపాటు వారి నలుగురు స్నేహితులు ఎంజే అసోసియేషట్స్ నిర్వాహకులు చెప్పిన మాయమాటలు నమ్మి రూ.50 లక్షలు చెల్లించారు. గృహ రుణం కోసం వారు పలుమార్లు కోరినా వారి నుంచి స్పందన రావడం లేదు. డబ్బులు అడిగితే చంపుతామని బెదిరిస్తున్నారని బాధితులు అడిషనల్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. చట్టపరమైన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.

ఆడపిల్లలు పుట్టారని వేధిస్తున్నారు

పిడుగురాళ్ల మండలం గుత్తికొండకు చెందిన షేక్ హవాబికి 12 ఏళ్ల కిందట జానపాడుకు చెందిన బిల్లా సైదాతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు. ఆ తర్వాత వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని హవాబిని బిల్లా సైదా వేధిస్తున్నాడు. దీనికి అత్తమామలు కూడా బిల్లాకు సహకరిస్తున్నారు. పిడుగురాళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించలేదు. నాకు, నా బిడ్డలకు న్యాయం చేయాలని హవాబి అడిషనల్ ఎస్పీకి ఫిర్యాదు చేసింది.

రూ.7 కోట్లు అప్పుగా తీసుకొని పరారయ్యారు

యర్రంశెట్టి హీరో పేరుతో సంస్థను నడుపుతూ నమ్మకంగా తమ వద్ద రూ.7 కోట్లు అప్పుగా తీసుకొని సంస్థ నిర్వాహకుడు యర్రంశెట్టి రాము, బాబ్జిలు పరారయ్యారని నరసరావుపేట సాయినగర్‌కు చెందిన పలువురు ఫిర్యాదు చేశారు. జూలై 31వ తేదీన అప్పులు చెల్లిస్తామని చెప్పి 30వ తేదీ కుటుంబంతో సహా వెళ్లిపోయారని తెలిపారు. తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సత్యనారాయణ, వాసుదేవరావు, ఆంజనేయులు, నాగారాణి తదితరులు అడిషనల్ ఎస్పీని కోరారు.

పాఠశాలల్లో స్కౌట్స్, గైడ్స్ యూనిట్స్ ఏర్పాటు చేయాలి

రాష్ట్ర కార్యదర్శి ఆర్. నరసింహారావు



మాట్లాడుతున్న నరసింహారావు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో సేవాభావం, క్రమశిక్షణ, సమానత్వ భావాలతో పాటు దేశభక్తిని పెంపొందిస్తున్న భారత స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను ప్రతి పాఠశాలలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర కార్యదర్శి ఆర్. నరసింహారావు తెలిపారు. సోమవారం పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్ష భవన్‌లో గుంటూరు జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వార్షిక సమావేశాన్ని జిల్లా కార్యదర్శి ఎం. ఏడుకొండలు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసింహారావు గుంటూరు జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ రిజిస్ట్రేషన్, బిగినర్స్ కోర్స్ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. 955 పీఎంశ్రీ పాఠశాలలకు రూ. 50 వేలు చొప్పున విడుదల చేసిన నిధులతో విద్యార్థులకు యూనిఫామ్‌తో పాటు స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. ఉన్నతమైన సంస్థగా గుర్తింపు పొందిన స్కౌట్స్, గైడ్స్ ఆశయాలకు అనుగుణంగా సేవా భావంతో పనిచేయాలని సూచించారు. విద్యార్థులకు ఉన్నత చదువులు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్నారని తెలిపారు. జిల్లాలోని 111 పాఠశాల నుంచి 136 యూనిట్స్ రిజిస్ట్రేషన్ చేశారని వివరించారు. ఎస్‌ఓసీ పి.శ్రీనివాసరావు, చేబ్రోలు ఎంఈవో రాయ సుబ్బారావు, పెదకాకాని ఎంఈఓ బీవీ రమణయ్య, డీటీసీ టి. నరేష్ పాల్గొన్నారు.



ఉత్కంఠభరితంగా జాతీయ చెస్ పోటీలు



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

చేబ్రోలు: ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజ్ఞాన్‌లో నిర్వహిస్తున్న 62వ జాతీయ చెస్ చాంపియన్‌షిప్-2025 పోటీలు సోమవారం రెండో రోజు ఉత్కంఠభరితంగా సాగాయి. వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. 14 మంది గ్రాండ్‌మాస్టర్లు, 30 మంది ఇంటర్నేషనల్ మాస్టర్లు సహా మొత్తం 394 మంది పోటీ బరిలో నిలిచారు. తొలి రౌండ్‌లో ఎక్కువ మంది గ్రాండ్ మాస్టర్లు, ఇంటర్నేషనల్ మాస్టర్లు సునాయాస విజయాలతో రెండో రౌండ్‌కి చేరుకున్నారు.

- రెండో సీడ్ సూర్యశేఖర్ గంగూలి మొదటి రోజు సుదీర్ఘమైన గేమ్‌నుఆడి, చివరికి విజయం సాధించా రు.
- రైల్వే జట్టుకు చెందిన గ్రాండ్‌మాస్టర్ దీపన్ చక్రవర్తి, ఐఎం సిద్ధాంత్ మోహాపాత్రా ప్రత్యర్థులతో పాయింట్లు పంచుకోవాల్సి వచ్చింది.
- పీఎస్‌పీబీకి చెందిన ఐఎం నిషా మొహోటా, తెలంగాణ ఆటగాడు మోక్షిత్ పసుపులేటి చేతిలో ఓటమి పాలయ్యారు.
- ఆంధ్రప్రదేశ్ అభిమాన ఆటగాడు, 2017 జాతీయ చాంపియన్ లలిత్ బాబు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన గగన్ సహూను చాకచక్యంగా ఓడించారు.

పోక్సో కేసు నిందితుడికి పదేళ్ల జైలు

నాదెండ్ల: పోక్సో కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ గుంటూరు ప్రత్యేక పోక్సో న్యాయస్థానం సోమవారం తీర్పునిచ్చింది. ఎస్సై జి పుల్లారావు తెలిపిన వివరాల మేరకు.. గణపవరం రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన మైనర్ బాలిక 2025 మే 28న గ్రామానికి చెందిన మందలపు శివప్రసాద్ తనపై అత్యాచారయత్నం చేశాడంటూ ఫిర్యాదు చేసింది. దీనిపై అప్పటి ఎస్సై సతీష్ కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ సి విజయ భాస్కర్ విచారణ నిర్వహించారు. నేరం రుజువు కావటంతో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

జిల్లాకు 1860 టన్నుల యూరియా



సాతులూరులో రేక్ పాయింట్ వద్ద ఏడీఏ శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ అధికారులు

నాదెండ్ల: జిల్లాకు మూడో విడతగా 1860 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించినట్లు నరసరావుపేట ఏడీఏ కేవీ శ్రీనివాసరావు చెప్పారు. సాతులూరులోని రైల్వే ఎరువుల రేక్ పాయింట్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఎరువులను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, గ్రోమోర్, డీలర్లకు నిష్పత్తి ప్రకారం పంపిణీ చేయాలని స్థానిక వ్యవసాయాధికారులను ఆదేశించారు. పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని సూచించారు. ఆయనతోపాటు ఏవో శ్రీలత, సిబ్బంది జీపీ శ్రీనివాసరావు ఉన్నారు.

కృషి, పట్టుదలతోనే ప్రభుత్వ ఉద్యోగాల సాధన



మాట్లాడుతున్న నవీన్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు కృషి, పట్టుదలతో ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలను సాధించాలని కౌండిన్య ఐఏఎస్ అకాడమీకి చెందిన అధ్యాపకుడు ఎస్. నవీన్ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ పీజీ కళాశాలలో సోమవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధతపై వెనిగండ్లలోని కౌండిన్య ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఎంబీఏ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ అధ్యాపకుడు కోటేశ్వరరావు ప్రభుత్వ పోటీ పరీక్షలైన సివిల్స్, ఎస్సెస్సీతో పాటు ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఎల్ఐసీ, బీపీసీఎల్ వంటి సంస్థల్లో ఉద్యోగావకాశాలను గురించి వివరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో విస్తృతంగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కృషి, పట్టుదలతో ప్రణాళికాబద్ధంగా పోటీ పరీక్షలకు సిద్ధమైతే తప్పక విజయం సిద్ధిస్తుందని చెప్పారు. ఎంబీఏ విద్యార్థులు కమ్యూనికేషన్, పరిపాలనా నైపుణ్యాలతో ప్రైవేటు రంగంలోనే కాకుండా, ప్రభుత్వ రంగ సంస్థల్లో సైతం రాణించగలరని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అనితాదేవి, మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి యు. రవి కుమార్, వాణిజ్య విభాగాధిపతి ఎస్. శ్రీనివాసరావు, అధ్యాపకుడు నాంచారయ్య, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.